బాలసాహితి:

# పిల్లల మీద అధికారం

చాలాకాలం క్రితం బుందేల్ రాజ్యంలో ఒక మహారణ్యం ఉంటుండేది. ఆ అరణ్యంలో ఒక బూరుగుచెట్టుమీద ఒక పిచికయ్యా, ఒక పిచికమ్మా కాపరం చేస్తుండేవి. వాళ్ళకు ఇద్దరు చిన్నారి పొన్నారి పాపాయీలు కలిగారు. ఆ పాపాయీల్తో పిచికయ్యా, పిచికమ్మా ఆనందంగా కాలం వెళ్ళబుస్తుండేవారు.

ఇలా ఉంటుండగా ఒకసారి ఆ అడవికి కార్చిచ్చు తగిలి 'భగ-భగ' మని కాలిపోసాగింది. గొప్ప గొప్ప మర్రిచెట్లుకూడ కాలి బూడిదఅయిపోతున్నవి. ఆ మంటలు నాలుకలు చాచుకుంటూ బూరుగుచెట్టువేపు రానారంభించినవి. అప్పుడా పిచికయ్య చచ్చిపోతానేమో అన్న భయంకొద్దీ పిచికమ్మకూ, పాపాయీలకూ చెప్పకుండా రివ్వున ఎగిరి దూరంగా పారిపోయాడు. పాపం పిచికమ్మకు మాటాడ్డానికైనా అవకాశం లేకపోయింది. కాని పిచికయ్యలా తాను పారిపోలేకపోయింది. ఆ యిద్దరి పాపాయీలకు యింకా రెక్కలు రాలేదు. ఆ ముద్దుముఖాలు చూసి ఆ పిచికమ్మ వాటితోపాటే చచ్చిపోదామని గూటిదగ్గర ఉండిపోయింది. అయితే అదృష్టవశాత్తూ ఆ కార్చిచ్చు బూరుగుచెట్టుదగ్గరకు రాకముందే ఆరిపోయింది. తమ ఆపదను దాటించినందుకు పిచికమ్మ దేవుణ్ణి వెయ్యివిధాల ప్రార్థించింది.

కార్చిచ్చు బాగా ఆరిపోయాక పిచికయ్య గూటిదగ్గరకు వచ్చాడు. అది చూసి పిచికమ్మకు పట్టరాని కోపం వచ్చి పిచికయ్యతో యిలా అన్నది—

"నువ్వెందుకు యిక్కడకొచ్చావు?"

"నాయింటికి నేనొచ్చాను నువ్వెవర్తవు అడగడానికి?" అని పిచికయ్య రోషంతో అన్నాడు.

కు. జానకిరామ్ పట్నాయక్

"చాల్చాలు! నీ యిల్లు అని చెప్పడానికి సిగ్గు వేయలేదూ? కార్చిచ్చు వచ్చి నీ యింటినీ, నీ భార్యాపిల్లల్ని కాల్చి బూడిద చేయబోయే సమయంలో దయలేకుండా నీ ప్రాణాలు కాపాడుకోవటానికి పారిపోయావు! మేము చచ్చినా యింతేకదా? ఏదో దేవుడు కాపాడాడు గాబట్టి బతికిపోయాం!..ఇకమీద నీకూ మాకూ సంబంధం లేదు! నీ యిష్టం వచ్చిన చోటికి పో!" అని పిచికమ్మ తూలనాడింది.

అందుకు పిచికయ్య వికటంగా నవ్వి, మీసం మెలిపెట్టి ఇలా అన్నాడు—

"శభాష్! నీతివాక్యాలు మహా బాగా చెబుతున్నావే? నోర్మూయ్! నేను మగవాణ్ణి! ఏం చేయడానికీ నాకు అధికారం ఉంది! ఈ యిల్లు నాది! ఈ పిల్లలు నా పిల్లలు!... ఎటు పోతావో నువ్వే పో!"

"సరి సరి!......యీ పిల్లలు నీ పిల్లలు ఎలాగవుతారు?... వాళ్ళను కన్నది నేను! పోషించింది నేను! ప్రాణాపాయసమయంలో కాపాడింది నేను!...యింతా చేస్తే వీళ్లు నా పిల్లలు కారా?...కార్చిచ్చు వచ్చి వీళ్ళను కాల్చివేయబోయే సమయంలో నువ్వెందుకు వీళ్ళను వదిలి పారిపోయావు? వీళ్ళు ఆ మంటల్లో పడి విలవిల తన్నుకొని, కాలి, బూడిద అయిపోతారన్న జ్ఞానం అప్పట్లో నీ కెందుకు లేకపోయింది? వీళ్లు నీ పిల్లలే అయితే కాపాడ్డానికి ఎందుకు ఉండిపోయావు కావు?...చాల్చాలు! అంతా చల్లబడిపోయింది గనక యిప్పుడు నీ మగతనం, నీ అధికారం చలాయించడానికొచ్చావ్?... వెళ్లు వెళ్ళు!... నీకిక్కడ ఏమీ లేదు!" అని పిచికమ్మ వాదించింది. కాని పిచికయ్య వినలేదు. తిన్నగా ఆ రాజ్యం రాజుగారిదగ్గరకు వెళ్లి ఫిర్యాదుచేశాడు.

రాజు పిచికమ్మను పిలిపించాడు. ఇద్దరి వాదోపవాదాలూ విన్నాడు. చివరకు ఎలా న్యాయపరిష్కారం చేశాడంటే—"పిల్లలమీద అధికారం మగవానిదే కాని ఆడదానికి లేదు! కనక పిచికమ్మ, పిచికయ్య చెప్పినట్టుగా వినాలి."

# ★ పిల్లలమీద అధికారం ★

ఈ పరిష్కారం పిచికమ్మ విని చాలా దుఃఖించింది. కాని పల్లెత్తు మాట అనలేదు. రాజుగారి నిర్ణయాన్ని ఒక రాగిరేకుమీద వ్రాయించి, రాజుగారి సంతకం తీసుకొని, దాన్ని తిన్నగా రాజభవనంలో మారుమూలను దాచిపెట్టి వెళ్ళిపోవచ్చింది. తరువాత ఆ పిచికమ్మ తలబద్దలు కొట్టుకొని చచ్చిపోయింది.

మరుచటి జన్మలో పిచికమ్మ ఒక గొల్లవారింట ఆడపిల్లగా జన్మించింది. ఆ పిల్ల పేరు నక్కు! నక్కుకు పూర్వజన్మలోని విషయాలన్నీ జ్ఞాపకం ఉన్నాయ్! పదిహేనోసంవత్సరం వచ్చేసరికి నక్కు తన యింట్లోఉన్న ఎద్దుల్ని తోలుకొని అడవికి తీసుకుపోయి మేపుకొని వస్తుండేది!

అదే అడవికి ఆ రాజుగారి ఆవులూ, దూడలూ మేతకు వస్తుండేవి. ఒకనాడు నక్కు, రాజుగారి దూడల్ని తన ఎద్దుల్తోనహా ఇంటికి తోలుకొని వెళ్ళిపోయింది! ఆ విషయం పశువులకాపర్లు రాజుగారితో ఫిర్యాదుచేశారు. రాజుగారు వెంటనే నక్కును పిలిపించి ఇలా అడిగారు—

"నువ్వు మా దూడల్ని ఎందుకు తోలుకుపోయావు?"

ఆ ప్రశ్న విని నక్కు నవ్వి "రాజా! పిల్లలమీద మగవానిది కదా అధికారం! అందుకని ఆ దూడల్ని మా ఎద్దులదగ్గర కట్టివేశాను!" అన్నది.

గతంలో జరిగినదంతా రాజు అప్పుడే మర్చిపోయాడు. అందువల్ల ఆశ్చర్యపోతూ "అదెలా గవుతుంది? నీ కెవరు చెప్పారు పిల్లలమీద మగవానిదే అధికారంఅని?" అంటూ ప్రశ్నించాడు.

వెంటనే నక్కు తాను పిచికమ్మగా ఉండి దాచిఉంచిన రాగిరేకును నౌకర్లద్వారా తెప్పించి రాజుకు చూపించి "ఇదిగో! మీరే న్యాయపరిష్కారం చేశారు పిల్లలమీద మగవానిదే అధికారం అని!" అన్నది నవ్వుతూ.

పాపం రాజు తన సంతకంతో ఉన్న తీర్పును చూసి మాటాడలేకపోయాడు. లోలోపలమాత్రం తన పరాజయానికి ఉడికిపోయాడు. ఎలానైనా నక్కును పెండ్లాడి ప్రతీకారం తీర్చుకుందామని నిశ్చయించుకొన్నాడు. అప్పటికి మరేమీ అనకుండా నక్కును పంపించి వేశాడు.

తరువాత కొన్నాళ్ళకు నక్కు తండ్రి చనిపోయాడు. ఆ సమయం చూసుకొని రాజు, నక్కును తనకిచ్చి పెండ్లిచేయాల్సిందిగా నక్కు తల్లికి కబురంపించాడు. దానికి నక్కు తల్లి ఒప్పుకోలేదు. కులాచారానికి వ్యతిరేకంగా తానీ వివాహం చేయజాలనని ఖచ్చితంగా రాజుకు చెప్పివేసింది. రాజుకు కోపం వచ్చింది. జబర్దస్తీగా అతను నక్కును పెండ్లి చేసుకున్నాడు. తరువాత నక్కుతో గర్వంగా యిలా అన్నాడు—

"చూశావా మగవాని అధికారం అంటే ఎలాంటిదో?"

అందుకు నక్కు కోపపడి "అవును! మీలాంటి మగ మహారాజుల అధికారం మాలాంటి పేద వారిమీదా, ఆడవారిమీదా కాక మరెవరిమీద ఉంటుంది? మీతో సమానులయిన మగవారిపట్ల మీ బలం చూపించి, మీ అధికారం నిలబెట్టుకుంటే అప్పుడు మీ మాట చెల్లినట్టు!" అన్నది.

ఆ మాటలు రాజుకు బాణపు ములుకుల్లా తగిలాయ్! పౌరుషంతో యిలా అన్నాడు—

"సరే! అదీ చేసి చూపిస్తాను!" అని వెంటనే గుర్రంమీద బయల్దేరిపోయాడు!

అలా గుర్రంమీద వెళ్ళగా వెళ్ళగా అతనికి ఒక ఎడారి రాజ్యం కనిపించింది. ఆ ఎడారి రాజుకు, దేవకాంతల్ని ధిక్కరించే అందంగల కుమార్తె ఉన్నదని అతనికి తెలిసింది. ఆ అమ్మాయిని తన కిచ్చి వివాహం చేయవలసిందిగా రాజు కబురంపించాడు. అందుకా ఎడారి రాజు ఏమన్నాడంటే—"నా కేమీ అభ్యంతరం లేదు. కాని ఒక్క షరతున్నది. అది ఏమనగా-ఎవరైతే ఒక దొన్నెడు నీటిలో స్నానం చేస్తారో వారే నా కుమార్తెను వివాహమాడ్డానికి అర్హులు! అలా చేయలేనివారు ముక్కుకు గవ్వ కట్టుకొని ఆజన్మాంతం నూనెగానుగ తిప్పాలి! దీని కిష్టపడితే రావొచ్చు!"

ఆవేశంలోఉన్న రాజు ముందూ వెనకా ఆలోచించకుండా "సరే!" అని ఒప్పుకున్నాడు. కాని తీరా ఆకుదొన్నెలో ఉన్న నీరు చూసేసరికి తెల్లబోయాడు! ఓడిపోయాడు! ముక్కుకు గవ్వ కట్టుకొని నూనెగానుగ తిప్పుతున్నాడు!

ఈ సంగతి సక్కూకు తెలిసింది. వెంటనే ఆమె మగవేషం వేసుకొని, భర్త కత్తిని పట్టుకొని, గుర్రంమీద ఆ ఎడారిరాజ్యం చేరుకున్నది. ఆ రాజు నిర్ణయించిన షరతు విన్నది. తనకు పూర్వజన్మ వృత్తాంతం తెలుసు గనుక దేవుణ్ణి ప్రార్థించి, తక్షణం పిచికమ్మగా మారిపోయింది! ఆ అకుదొన్న నీళ్లలో శుభ్రంగా స్నానంచేసి తిరుగా మామూలు మగవేషంలోనికి వచ్చేసింది! ఆ ఎడారిరాజు అది చూసి ఆశ్చర్యపోయి వెంటనే తన కుమార్తెనిచ్చి వివాహం చేయబోయాడు! కాని సక్కూ ఒప్పుకోలేదు. ఎందుకు ఒప్పుకుంటుంది? అసల్లో తను ఆడది! ఎలా ఆ ఎడారి రాజు కుమార్తెను వివాహమాడుతుంది?...అందుకని సక్కూ యిలా అన్నది—

"మా వంశంలో మగవారికి బదులు కత్తికి వివాహం చేస్తారు. మీరు అదేవిధంగా మీ అమ్మాయికీ మా కత్తినిచ్చి వివాహం చేయండి!"

ఎడారిరాజు దానికి సమ్మతించి అతివైభవంగా కుమార్తెకూ, కత్తికీ వివాహం చేశాడు!

తరువాత సక్కూ గానుగ తిప్పుతున్న భర్త దగ్గరకు వెళ్లి గొంతు మార్చి యిలా అన్నది—

"మీకు పౌరుషం లేదు! కనుక మీకు మీసం ఉండరాదు!" అని ఒక పక్క మీసం కత్తిరించివేసి ఆ మీసాన్ని, ముక్కుకు కట్టినగవ్వను విప్పి ఆ గవ్వనూ తన దగ్గర ఉంచుకొని "మీ రాజ్యం వెళ్లిపోండి" అని విడిపించి వేసింది.

మర్నాడు ఆ మగవేషంలో సక్కూ, ఎడారిరాజు కుమార్తె, కొంత సైన్యమూ బయల్దేరినారు. సక్కూ గుర్రంమీద ముందు పోతున్నది. వెనకగా పల్లకీలో ఎడారిరాజు కుమార్తె వస్తున్నది. వాళ్ల వెనుక సైన్యం వస్తున్నది. అందరికన్నా వెనకగా రాజు తల వంచుకొని వస్తున్నాడు.

ఆనాటి రాత్రి అంతా ఒక అడవిలో బస చేశారు. సగంరాత్రి గడిచాక సక్కూ, తన గుర్రం వదిలిపెట్టి, ఇంకో గుర్రంమీద ముందుగా పట్నం పారిపోయింది. తన మగవేషం తీసి, మామూలు రూపంతో అంతఃపురంలో ఉన్నది.

ఇక్కడ అడవిలో! తెల్లవారేసరికి రాకుమారుని వేషంలో ఉన్న సక్కూ కనిపించలేదు. అదే సమయమనుకొని వెనకనుంచి వస్తున్న రాజు, సక్కూ వదిలివేసిన గుర్రంమీద బయలుదేరి ఎడారిరాజు కుమార్తె పల్లకీ ముందు నడుస్తున్నాడు. అందరూ అతడే రాకుమారుడనుకొన్నారు!

రాజు సరాసరి తనపట్నం చేరుకున్నాడు. అంతఃపురంలోనికి వెళ్లేసరికి సక్కూ, తలవంచుకొని, ఎదురుగా పోయి అతని పాదాలకు నమస్కరించింది. ఆమె వేపు రాజు దర్జాగా చూసి "చూశావా నీవన్నట్టు నాతో సమానుడైనవారిమీదా, మగవారిమీదా నా అధికారం చూపించి, ఎడారిరాజు కుమార్తెను ఎలా వివాహమాడుకొచ్చానో! ఇప్పుడు చెప్పు అధికారం ఎవరి పాత్రో?" అన్నాడు.

సక్కూ లేచి నిల్చుని, రాజు ముఖంలోకి చూసింది! రాజుగారి మీసాలు రెండువేపులా కుడిచి పెట్టబడిఉన్నాయ్!

వెంటనే సక్కూ చెంగులో ముడివేసి ఉంచిన సగం మీసం, గవ్వ, రాజు ఎదుట ఉంచుతూ, చిరునవ్వుతో "మహారాజా! పౌరుష చిహ్నం అయిన మీసాన్ని పోగొట్టుకొని, ముక్కుకు గవ్వ కట్టుకొని గానుగ తిప్పుతూ, సిగ్గులేక, ఆడవాళ్ళ ఎదట యిలా డాబులు కొట్టగలిగినవారు ఎంతయినా అధికారం ఉంచుకోగలరు!" అంటూ తన పూర్వపు పిచికమ్మ రూపం ఎత్తి, కిటికీగుండా 'తుర్రు'న పారిపోయింది!

(బుందేల్ రాజ్యంలోని
జానపదగాథ)

### "ఇట్లు..."

ఒక 'సత్తెకాలపు' అమ్మాయికి బస్తీనించి ఆమె భర్త, పాతిక రూపాయలకి చెక్కు పంపించాడు. చిన్న తమ్ముడిని వెంటబెట్టుకుని ఆ పడుచు బ్యాంకుకి వెళ్లి చెక్కు చూపించి 'ఏం చెయ్యాల'ని అడిగింది.

"దానికేముందమ్మా. ఉత్తరాల క్రింద చేసినట్టే, ఆ చెక్కు వెనకాతలవైపు సంతకం చేసి ఇయ్యి" అన్నాడు కాషియర్.

ఆ పిల్ల తమ్ముడితో కలిసి కొంతసేపు ఆలోచించి, చివరకి సంతకంచేసి చెక్కు కాషియర్‌కి ఇచ్చింది.

దానిమీద, "ఇట్లు మీ చరణదాసి సుబ్బులు" అని వ్రాసిఉంది.